# ఎన్నికల తుఫాన్



మీకు గుర్తుందో, లేదో- మేము అదివరలో మా కాలనీ తరపున సినిమా తీయడానికని ఓ కమిటీ వేశాము. ఆ సినిమా కథను మాంచి మార్క్సిజం మసాలాతో నింపానంటూ చంద్రకాంత్ చటోపాధ్యాయ స్క్రిప్ట్ మాకు సమర్పించాడు.

అందరం కూచుని మొదట పేజీ చదివామో లేదో "మిగతాది ఇప్పుడు కాదు" అన్నారు కమిటీ వాళ్ళందరూ ఖంగారుగా. మొదటి పేజీలోనే హీరో రిక్షా తొక్కుతూ తొక్కుతూ నడిరోడ్డు మీద రిక్షా ఆపి రిక్షాలో కూర్చున్న వాడిని "విప్లవం వర్ధిల్లాలి" అంటూ కత్తితో పొడిచేస్తాడు.

"ఇదేమిటి? అది విప్లవం ఎలా అవుతుంది?" అని అడిగాను నేను ఆశ్చర్యంగా.

"మనిష్టం సార్! మనం ఏ రకంగా రాసినా దానిని మార్క్సిజం అనవచ్చు! ఎలాంటి సినిమా తీసినా 'ప్రజలు, రక్తం, విప్లవం' అనే మూడు డైలాగులు చివరల్లో చేర్చేస్తే అది మార్క్సిజం సినిమా అయిపోతుంది. అందాకా ఎందుకూ మీరు ఈ మధ్య టీవీలో వస్తోన్న నగ్జలైట్ల నాటకం చూళ్ళేదా?"

ఆ మాటతో అందరం సైలంటయిపోయాము. ఇంక అతనిని తప్పు పట్టటానికి ఏ మాత్రం వీల్లేదనిపించింది. అలా అన్జెప్పి రిక్షావాడు రిక్షాలో కూర్చున్న వాడిని పొడిచెయ్యటం, కాఫీ హోటల్ సర్వర్, తింటున్న వాడిని గొడ్డలితో నరికెయ్యటం, సినిమా స్టూడియోల్లో లైట్‌బాయ్ ప్రొడ్యూసర్ని మర్డర్ చేసేయడం- ఇవన్నీ విప్లవమే

అంటే ఎలా వప్పుకోగలం? అంచేత అప్పటికి స్క్రిప్ట్ రీడింగ్ నిలిపివేశాము.

ఆ మర్నాడే హఠాత్తుగా బోసుబాబు మద్రాస్ నుంచి వచ్చాడు. అందరం అతని చుట్టూ మూగాము.

"మన కాలనీ సినిమాకి టైటిల్ రిజిష్టర్ చేసేశాను" అన్నాడతను.

"ఏం పేరు పెట్టావ్?" ఆతృతగా అడిగాడు శాయిరామ్.

"గుళ్ళో దేవుడు - ఊళ్ళో యముడు"

అందరం ఆశ్చర్యపోయాం.

"అదేమిటి? కథ తెలీదు కదా నీకు? ఆ టైటిల్ అసలు సరిపోదు దానికి!" అన్నాడు శాయిరామ్. బోసుబాబు ఘొల్లున నవ్వాడు.

"సినిమా ఫీల్డంటే ఏ మాత్రం తెలీని శుంఠలు చేసే కామెంట్ అది!" అన్నాడు మమ్మల్నందరినీ 'ఉసుళ్ళు' అనే పురుగుల్ని చూసినట్లు చూస్తూ

'శుంఠలు' అన్నదుకు మాకు కోపం వచ్చింది గానీ.. ఆ విషయం బయటపడకుండా నవ్వేశాము. ఎందుకంటే మాకు సినిమా ఫీల్డులో విషయాలు నిజంగానే తెలీదు.

"సినిమా తీయాలంటే కథా, డైరెక్షనూ, యాక్టర్లు ముఖ్యం కాదు. అది ఓల్డ్ టెక్నిక్! ఇప్పుడు మొత్తం పిక్చర్స్ మనం పెట్టే టైటిల్ మీద ఆధారపడి వుంటుంది.

ఫీల్డంటే తెల్సినోళ్ళు ఫలానావాడు సినిమా ఎలా తీస్తున్నాడూ, ఏం తీస్తున్నాడూ అని కొశ్చెన్ చేయరు. ఏం టైటిల్ పెట్టాడని అడుగుతారు. డిస్ట్రిబ్యూటర్లూ, జిల్లా లోళ్ళు అందరూ ముహుర్తం పెట్టగానే ఏకగ్రీవంగా అడిగేదదే కొశ్చెన్! టైటిలేం రిజిష్టర్ చేశారు! అంతే!" అందరం నోళ్ళు వెళ్లబెట్టి వాడి మాటలు వినసాగాము.

"ఇప్పుడు చూడండి! రేపు షూటింగ్ ముహూర్తం నాడు సినిమా పేరు "గుళ్ళోదేవుడు–ఊళ్ళో యముడు" అని పేపర్లలో వేయించామనుకోండి! అంతే తెల్లారేసరికల్లా మన కాలనీ కమిటీవాళ్ల చుట్టూ డిస్ట్రిబ్యూటర్లూ, జిల్లాల వాళ్ళూ తెగతిరుగుతారు– వాళ్ళ ఏరియాలకు కొనేసుకోడానికి!"

అందరం చాలా గర్వంగా నిజంగా ప్రొడ్యూసర్లలాగా ఫీలయ్యాం! మా చుట్టూ కొన్ని వందలమంది చేతులు చాచి మా గడ్డాలు పట్టుకుని ప్రాధేయపడుతున్న దృశ్యం కళ్ళముందు కనిపించింది.

"నాకు ప్రస్తుతం నాల్రోజులు మాత్రమే ఖాళీ ఉంది! కనుక మనందరం ఇవాళ రాత్రికే 'మచిలీపట్నం' వెళ్ళి లొకేషన్స్ సెలక్షన్ చేసుకురావాలి!" అన్నాడు బోసుబాబు. ప్రొడ్యూసర్ హొదాలో లొకేషన్స్ సెలక్షన్ చేసుకురావాలి!" అన్నాడు బోసుబాబు. ప్రొడ్యూసర్ హొదాలో లొకేషన్స్ సెలక్షన్ కెళ్ళడం చాలా ఆకర్షణీయంగా కనిపించింది మాకు.

ఆ రాత్రికే శాయీరామ్, నేనూ, రంగారెడ్డి జనార్ధన్, గోపాల్రావ్ పార్వతీదేవీ, రాజేశ్వరి, వెంకట్రావ్, యాదగిరి అందరం రైలుకి 'మఛిలీపట్నం' బయల్దేరాం! అక్కడ సముద్ర తీరంలో లొకేషన్స్ చూడాలని బోసుబాబు ప్లాన్!

మఛిలీపట్నంలో దిగగానే అందరం త్వరత్వరగా హెూటల్ కెళ్ళి, స్నానాలూ వగైరాలూ కానించి బస్‌స్టాండ్‌కి చేరుకున్నాం. ముందు మఛిలీఫోర్ట్ కెళ్ళాం గానీ అక్కడి సీనరీ బోసుబాబుకి నచ్చలేదు. అక్కడి నుంచీ అందరం 'గోడదేవరపల్లి' కెళ్ళాం. బస్‌దిగి ఊరుదాటి సముద్ర తీరం చేరుకునేసరికి మధ్యాహ్నం పన్నెండయిపోయింది.

చాలా బ్రహ్మాండంగా ఉంది సీనరీ అక్కడ. ఆకాశమంతా మబ్బులతో మూసుకుపోవడం వల్ల మరింత ఆహ్లాదంగా ఉంది.

తీరం వెంబడి సరుకు తోటలు సముద్రం వేపు నుంచీ చూస్తోంటే ఎంతో అందంగా కనబడుతున్నయ్. "ఒండర్ ఫుల్" అన్నాడు బోసుబాబు. "అద్భుతమయిన లొకేషన్! ఇక్కడ హీరో హీరోయిన్స్ మీద సాంగ్స్ షూటింగ్స్ చేయవచ్చు.

జనార్ధన్ పొంగిపోయాడు. తను ఆ క్షణంలోనే హీరో అయిపోయి నట్లనిపించింది అతనికి.

"అవును! నేను ఇటువేపునుంచీ పరుగెత్తుకొస్తాను– హీరోయిన్ అటువేపు నుంచీ పరుగెత్తుకొస్తుంది. ఇద్దరం ఈ పడవ దగ్గర కలుసుకుని– ఎగురుతూ పడవ చుట్టూ తిరిగిపాడతాం!" అన్నాడు ఆనందంగా.

అందరం మరికొంత దూరం నడిచాము.

"ఇక్కడనుంచీ సముద్రంలో టైటిల్స్ వేస్తే ఎలా వుంటుంది?" అడిగాడు శాయీరామ్. బోస్‌బాబు కెమేరాలో నుంచి చూస్తున్నట్టు వంగి ఓర కంటితో సముద్రం వేపు చూశాడు.

"సూపర్బ్! టైటిల్స్ ఆకాశం నుంచి కిందకుదిగి సముద్రంలో మునిగిపోతూండేట్లు లాగిస్తే భలే వెరయిటీగా ఉంటుంది!" అన్నాడతను.

పార్వతీదేవి భుజానికున్న ట్రాన్సిస్టర్‌లో నుంచి వినిపిస్తోన్న సంగీతం ఠక్కున ఆగిపోయింది.

"ఒక ముఖ్య ప్రకటన! బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం వల్ల రానున్న 48 గంటలలో గంటకు 150 నుంచీ 180 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయ్. విస్తృతంగా వర్షాలు పడే సూచనలున్నాయ్. ఈ వాయుగుండం మఛిలీపట్నం ప్రాంతంలో తీరాన్ని దాటవచ్చు! ఆ సమయంలో సముద్ర కెరటాలు పదినుంచీ పదిహేను మీటర్ల ఎత్తున ఎగసిపడతాయ్–"

పార్వతీదేవి మొఖం పాలిపోయింది. మిగతా అందరూ కూడా భయంగా సముద్రం వేపు చూశారు.

"మనకేం భయంలే! సాయంత్రానికి మఛిలీపట్నం చేరుకుని బస్సెక్కామంటే తెల్లారేసరికి ఇళ్ళకు చేరుకోవచ్చు–" అన్నాడు శాయీరామ్ స్వగతంగా.

"అవునవును– కొంచెం త్వరగా మనం వెనక్కు తిరగడం మంచిది" అన్నాడు జనార్ధన్.

"మొత్తం పిక్చరంతా ఈ ఏరియాలోనే లాగించేద్దాం!" అన్నడు బోసుబాబు తన లొకేషన్స్ కార్యక్రమం ముగిసినట్లు ప్రకటిస్తూ.

అప్పటికే టైము సాయంత్రం నాలుగయింది.

మేము ఊరివేపు నడుస్తూండగానే మబ్బులు మరింత మూసుకుపోయాయ్. వర్షపు చినుకులతో పాటు ఉండుండి గాలికూడా వీయసాగింది.

"ఇలాంటి సైక్లోన్ సమయాల్లో సముద్రపు తీరంలో ఉండడం చాల డేంజర్–" అంది రాజేశ్వరి.

సాయంత్రం అయిదయిపోయింది. అందరం ఊళ్ళోని బస్ షెల్టర్ చేరుకునేసరికి అప్పటికే చీకటి పడిపోయినట్లుంది. బస్‌స్టాప్‌లో మేమూ, మాతోపాటు ఓ ముసలాయనా తప్పుతే ఇంకెవరూ లేరు.

ఆరయిపోయినా బస్ జాడ లేకపోమేసరికి మాకు ఆందోళన మొదలయింది. మా ఆందోళన ముసలాయన గమనించినట్లున్నాడు.

"నేనూ మఛిలీపట్నమే వెళ్ళాలి గానీ– బస్‌లు వచ్చే నమ్మకం లేదిక!" అన్నాడు స్వగతంగా. అందరం ఉలిక్కిపడ్డాము.

"ఎందుకంటారు?" అడిగాడు శాయీరామ్ ఖంగారుగా.

"సైక్లోన్ వార్నింగ్ ఇచ్చారు కదా రేడియోలో? అదీ ఆర్టీస్ వాళ్ళు కూడా వింటారు కదా!"

అందరి గుండెల్లోనూ రాయిపడింది.

"ఇప్పుడు మనకేందారి?" అంది పార్వతీదేవి భయంగా.

"అదేదో సినిమాలో ఇలాగే కొంతయంది ఫ్రెండ్స్ ఇలాగే సీషోర్ కెళ్ళి అక్కడ చిక్కడిపోతే ఓ హంతకుడొచ్చి అందరినీ ఛంపేస్తాడు–" అంది రాజేశ్వరి.

"బస్ రాకపోతే ఏమిటి మన కర్తవ్యం? అడిగాడు జనార్ధన్ తన మేకప్ చెరగిపోయిందేమోనని పాకెట్ అద్దంలో చూచుకుంటూ.

"అంతగా బస్ రాకపోతే– ఇక్కడే ఎవరొకరింట్లో రాత్రి గడిపేద్దాం! పొద్దున్నే బస్ వచ్చేస్తుంది" అన్నాడు శాయిరామ్.

రంగారెడ్డి నవ్వాడు.

"అయిడియా బాగానే ఉంది గానీ ఈలోగా సముద్రం ఒక్క విసురు విసిరిందంటే

ఆ ఇంటితో సహా అందరం లోపలికెళ్ళిపోతాం!" అన్నాడు. ఆ మాటతో అందరికీ కాళ్ళూ చేతులు వణకసాగినయ్.

"ఆ మధ్య ఉప్పెనవచ్చి రాత్రికిరాత్రి ఆ చుట్టు పక్కల కొన్ని ఊళ్ళు ఆనవాల్లేకుండా సముద్రంలో కెళ్ళిపోయాయ్." అన్నాడు జనార్ధన్.

"అవును! రేడియోలో సముద్రపు కెరటాలు మరీ పది నుంచి పదిహేను మీటర్ల ఎత్తువరకు వస్తాయని చెప్పారు!" అన్నాడు జనార్ధన్.

దూరంగా బస్ వస్తున్న శబ్దం వినిపించింది సన్నగా.

"అదిగో! బస్సు వస్తోంద్ది!" ఆనందం పట్టలేక అంది పార్వతీదేవి. ఆ క్షణంలో ఆమెను చూసిన వారెవరయినీ సరే– ఆమెకు ప్రపంచంలో అత్యంత ప్రీతికరమయిన వస్తువు 'బస్సు' అని అర్థం చేసుకుంటారు.

అందరం ఊపిరి బిగపట్టి రోడ్ వేపే చూడసాగాం! దూరంగా రెండు లైట్లు కనిపించాయ్ ముందు.

"బస్సే–బస్సే" ఎగిరి గంతేస్తూ అంది రాజేశ్వరి. తీరా దగ్గర కొచ్చాక చూస్తే అది పోలీస్‌జీప్. స్పీకర్‌లో తుఫాన్ హెచ్చరికలు చేయడానికొచ్చారు వాళ్ళు.

"తీర ప్రాంతాలలో ఉన్న గ్రామాలన్నీ సముద్ర కెరటాలకు మునిగిపోయే ప్రమాదం ఉంది గనుక వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము–" అంటూ అనౌన్స్ చేస్తున్నారు స్పీకర్‌లో.

"ఒకవేళ– మనగోడు చెప్పుకుంటే ఆ జీప్‌లో మనల్ని మఛిలీపట్నం తీసుకెళ్తారేమో!" అంది పార్వతీదేవి ఆశగా.

ఆ మాట అనడం ఆలస్యం అందరం జీప్ దగ్గరకు పరుగెత్తాం. జీప్ చుట్టూ ఆ ఊరి జనం చేరి వివరాలు వాకబు చేస్తున్నారు.

రంగారెడ్డి చొరవగా ఇనిస్పెక్టర్ దగ్గరకెళ్ళి మాకో సహాయం చేస్తారా?" అనడిగాడు. కానీ ఆ గాలి హోరులో, జనం గొడవలో అతనికి సరిగ్గా వినిపించినట్లు లేదు.

"అవును! తప్పకుండా మీ అందరికీ ప్రభుత్వం సహాయం చేస్తుంది" అన్నాడతను.

"అది కాదండీ! మమ్మల్ని దయచేసి మీ జీప్‌లో మఛిలీపట్నంలో వదులుతారా" అడిగాడు శాయిరామ్.

"అవును! మఛిలీపట్నంలోనే సైక్లోన్ తీరాన్ని దాటవచ్చని అంటున్నారు." అన్నాడతను.

జీప్ వెళ్లిపోయింది మరో ఊరికి.

మా గొడవంతా విన్న పెద్దమనిషి మా అందరినీ తమ ఇంటికి రమ్మని ఆహ్వానించాడు. అడిగిందే చాలని అందరం ఇంటికెళ్ళి ఓ గదిలో కూర్చున్నాం. అందరికీ భోజనాలు కూడా అతనే ఏర్పాటు చేశాడు.

"మా సినిమాలో మీకు తప్పక ఓ వేషం ఇస్తాను!" అన్నాడు బోసుబాబు భోజనం చేసి.

"సినిమాలంటే నాకసయ్యం!" అన్నాడా పెద్దమనిషి. అందరం దుప్పట్లు పరచుకొని పడుకున్నామన్న మాటే గానీ సముద్రం మరీ ఇంటిబయటే వున్నట్లు శబ్దాలు వస్తూంటే నిద్ర పట్టలేదు.

ఇలాగోలా నిద్రపడుతూన్న సమయంలో జనార్దన్ కెవ్వున కేక వేశాడు. దాంతో అందరం అదిరిపోయి లేచి కూర్చున్నాం. జనార్ధన్ వణికి పోతున్నాడు.

"ఏమిటి? ఏం జరిగింది?" అడిగాన్నేను.

"కలొచ్చింది!"

"ఏం కల?"

"అదే మనమందరం ఉప్పెనలో కొట్టుకు పోతున్నామట! అంటే ఈ ఇంటితో సహా! అప్పుడు ఊపిరాడక గిలగిల కొట్టుకుంటూ నీళ్ళు తాగుతూంటే ఎదురుగ్గా టీవీలో హైద్రాబాద్ ప్రోగ్రామ్ కనిపించింది- అంతే ప్రాణాలు పోతున్నట్లనిపించింది. అరచేశాను...."

ఆ తర్వాత ఎవరికీ నిద్రపట్టలేదు. మరో గంట గడిచిందో లేదో పెద్ద శబ్దాలతో నాలుగయిదు బస్‌లు వచ్చినట్లు వినిపించింది.

"అదిగో బస్ వచ్చింది?" అంది రాజేశ్వరి ఛటుక్కు లేచి కూర్చుంటూ.

"ఛట్! మనం బస్ కోసం ఎదుర్చూస్తున్నాం కాబట్టి ఊరికే అలా అనిపిస్తుంది అంతే!" అన్నాడు శాయీరామ్.

మరుక్షణంలో ఎవరో తలుపులు గట్టిగా బాదసాగారు.

"నేను చెప్పలే! అర్ధరాత్రి హంతకులొస్తారని? వచ్చేశారు!" అందామె.

"ష్!" ఆమెవంక చూసి వారించాడు రంగారెడ్డి.

ఇంటాయన తలుపు తెరిచేసరికి ఎదురుగ్గా పోలీసులు నిలబడి వున్నారు.

"త్వరగా తయారయి, మీ విలువయిన వస్తువులు మాత్రం తీసుకుని బయటకు రండి! ఈ ఊళ్ళన్నీ ఖాళీ చేయించమని ప్రభుత్వ తాఖీదు లొచ్చాయ్-" అన్నాడొకాయన.

"అమ్మయ్యా ఇది మొదటిసారి! ఇలా దేవుడు పోలీసుల రూపంలో వచ్చి మనల్ని రక్షించడం!" అంది పార్వతీదేవి.

"వీళ్ళు నిజం పోలీసులేనంటారా?" అనుమానంగా అంది రాజేశ్వరి.

"ఏమిటా పిచ్చి అనుమానం?" కోపడ్డాడు రంగారెడ్డి.

"అదేదో ఇంగ్లీష్ పిక్చర్లో హంతకులు పోలీసుల డ్రస్‌లో వచ్చి అందరినీ జీప్‌లో తీసుకెళ్ళి అడవుల్లో రేప్‌లు- మర్డర్లూ చేసేశారు" అందామె.

"ష్" అన్నాడు జనార్ధన్. "అలా మాట్లాడిలే మననిక్కడే వదిలేస్తారు. –"

ఆ మాట చాలా పవర్‌ఫుల్‌గా పనిచేసింది. ఆ తరువాత ఆమె ఇంకేమీ మాట్లాడలేదు

అందరం లారీలో ఎక్కి కూర్చున్నాం. గంట ప్రయాణం తర్వాత రిలీఫ్ కాంప్ చేరుకున్నాం. పెద్ద స్కూల్ బిల్డింగ్ అది! చాలా పెట్రోమాక్సు లైట్లు వెలుగుతున్నాయి. మేమంతా ఓ గదిలో కూర్చున్నాము. తెల్లారుజామున మూడయిందప్పటికి. నిద్ర రాకుండా ఉంటానికి ఏదయినా జానపద గీతం పాడతానన్నాడు యాదగిరి. "రోజూ ఆ చెత్తంతా రేడేయోలో వినలేక చస్తుటే ఈ సైక్లోన్‌లో కూడా ఏమిటయ్యా ఆ పరాసికాలు?" అంటు కోప్పడ్డాడో పెద్దమనిషి.

''అయితే సినిమా పాటేదేనా పాడతాను!'' అన్నాడతను ఉత్సాహంగా. ఓ లావుపాటాయన ఆ మాట వింటూనే కోపంగా లేచి నిలబడ్డాడు. "ఏటీ? తెలుగు సినిమా పాట పాడతావా? ఆడాళ్ళు పిల్లలు ఉన్నచోట ఆ బూతు పాటలు పాడతావా? పళ్ళు రాలగొడతాను?'' అన్నాడు, అందుకు సంసిద్ధమవుతూ. దాంతో యాదగిరి సైలెంటయిపోయాడు.

రంగారెడ్డి, జనార్ధనూ ఈలోగా కాంప్ తాలూకు ప్రభుత్వాధికారులతో మాట్లాడి వచ్చారు. అప్పుడిక మమ్మల్ని మఛిలీపట్నం తీసికెళ్ళే ప్రసక్తి లేదని చెప్పారట వాళ్ళు. ఎలాగోలా తెల్లారేవరకు గడుపుతే పొద్దునే ఏదోక బస్‌లో వెళ్ళి పోవచ్చనుకుని ఊరుకున్నాము.

తెల్లారుజామున ఎప్పుడో నిద్రపట్టేసింది. తిరిగి "ఫలహారాలు" అన్న కేకలువిని మెలకువ వచ్చేసింది. అప్పటికే బాగా ఎండెక్కిపోయింది.

బయటికొచ్చి చూసేసరికి ఓ లారీ చుట్టూ రిలీఫ్ కాంప్‌లో జనం మూగిపోయి ఉ న్నారు. లారీలో ఇడ్లీలు, కాఫీ సప్లయ్ చేస్తున్నారు.

"త్వరగా రడీ అవండి. మనం బస్‌స్టాండ్ కెళ్ళి మఛిలీపట్నం వెళ్ళిపోదాం" అన్నాడు రంగారెడ్డి.

అందరం అరగంటలో రడీ అయి బయటకు వెళ్ళబోతూంటే గేటు దగ్గర ఉన్నవాళ్ళు అడ్డగించారు.

"ఎక్కడికి?" అడిగారు.

"మాది హైద్రాబాదు. మేము హైద్రాబాదు వెళ్ళిపోవాలి!" అన్నాడు శాయిరామ్.

"ఎవరూ ఎక్కడికీ వెళ్ళానికి వీల్లేదు!" అన్నారు వాళ్లు.

"ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

''ఏందుకేమిటయ్యా! సైక్లోన్ రిలీఫ్ కాంప్‌కి మిమ్మల్ని ఎందుకు తీసుకొచ్చామనుకున్నారు? వెంటనే వదిలేయటానికా?" వెటకారంతో అడిగాడు

"కానీ సైక్లోన్ రాలేదుగా? ఎండ చూడండి! కాలిపోతోందప్పుడే!"

"రాకపోతే మేమేం చెయ్యాలి!"

"మమ్మల్ని వదిలి వెయ్యాలి" అన్నాడు శాయిరామ్.

"అదేంకుదరండి? అఫీషియల్‌గా 'సైక్లోన్ రద్దయిపోయింది" 'అని మాకు పై నుంచి టెలిగ్రాం గానీ మెసేజ్ గానీ రావాలి! అంతవరకు ఎవ్వరూ కదలడానికి వీల్లేదు" అన్నాడొకతను.

"కానీ వెళ్ళేవాళ్ళను వెళ్ళనిస్తే మీకే ఈ తలనొప్పంతా తగ్గుతుంది కదా?"

అతను నవ్వాడు.

"భలే వారే సార్ మీరు! మా ఉద్యోగాలు తిన్నగా ఉండటం మీకిష్టం లేదా ఏమిటి? ఎలక్షన్ల ముందు సైక్లోన్‌లు వస్తే దానిని ఎలక్షన్ కోసం వాడుకోవటం మామూలేగా! అందుకే రిలీఫ్‌కాంప్‌లో ఉన్నవారిని జాగ్రత్తగా కనిపెట్టి ఉండమనీ అన్ని సౌకర్యాలు కలుగజేయమనీ పైన్నుంచి ఆర్డర్స్ వచ్చాయ్. మీ అందరినీ ఇప్పుడు వదిలివేస్తే మాకు మాటరాదూ?"

మేమంతా మొఖమొఖాలు చూచుకున్నాం. సరిగ్గా అప్పుడే టేబుల్ మీదున్న ట్రాన్సిస్టర్‌లో మళ్ళీ ప్రత్యేక సైక్లోన్ బులెటిన్ వెలువడింది.

"బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం నేడు ఉత్తరదిశగా ప్రయాణించి క్షీణించి పోయింది. అందువల్ల కొద్దిపాటి వర్షాలు కోస్తాతీరంలో పడే సూచనలున్నాయ్! అంతకుమించి ఏలాంటి ప్రమాదం లేదని మెటీరియోలజీ డిపార్ట్‌మెంటువారు తెలియజేస్తున్నారు"

వెంటనే రంగారెడ్డి ముందుకొచ్చాడు.

"ఇంకేం కావాలయ్యా మీకు! సైక్లోన్ లేదంటున్నారుగా?" వాళ్ళు ఏమీ చెప్పలేక "పదండి! మా ఆఫీసర్లతో మాట్లాడుదురు గాని!" అన్నారు.

నేనూ, రంగారెడ్డి, శాయిరామ్, జనార్థన్, అతనితోపాటు వాళ్ళ ఆఫీసర్ దగ్గరకు వెళ్ళాము.

అంతావిన్నాక అతను చిరునవ్వుతో తల అడ్డంగా ఊపాడు.

"వీల్లేదండీ! రిలీఫ్ కాంప్‌లో నుంచి ఎవ్వరినీ బయటకు పోకుండా చూడమని ఆదేశాలొచ్చాయ్, ఇంతకుముందే."

"కానీ సైక్లోన్ క్షీణించి పోయిందని ఇందాక రేడియోలో చెప్పారు కదా?" అడిగాడు శాయిరామ్.

"అలా చెప్పినందుకు రేడియోస్టేషన్ అధికారుల మీద చర్య తీసుకుంటున్నారు"

"అంటే వాళ్ళు చెప్పింది తప్పా?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

"ఇన్ఫర్మేషన్ తప్పుకాదు గానీ... ఓ పక్క సైక్లోన్ బాధితులను మన ప్రధానమంత్రిగారు పరామర్శించటానికి వస్తున్నారని తెలిసినప్పుడు – సైక్లోన్ రాదని చెప్పటం తప్పుకాదూ?"

అందరం ఆశ్చర్యపోయాము.

"ఏమిటి ఇక్కడికి ప్రధానమంత్రి గారొస్తున్నారా?"

"అవును"

"ఎందుకు?"

"చెప్పాను గదయ్యా! సైక్లోన్ బాధితులను పరామర్శించడానికి"

"కానీ సైక్లోన్ రాలేదుగా?"

"జిల్లూరు అనేచోట బాగా వర్షాలు పడ్డాయి కదా!"

"అలాంటప్పుడు అక్కడే పర్యటించక ఇక్కడకు రావడం ఎందుకు?"

"అదంతా వాళ్ళిష్టం బాబూ! మనమెవ్వరం కాదంటానికి!" సమాధానపరుస్తూ అన్నాడాయన.

హఠాత్తుగా పైన రెండు హెలికాప్టర్‌లు రావటం కనిపించింది మాకు. రిలీఫ్‌కాంప్‌లో ఉన్న వారందరు ఎగబడుతూ బయటికొచ్చి నిలబడ్డారు.

మరుక్షణంలో హెలికాప్టర్స్ నుంచి పెద్ద పెద్ద ఆహర పదార్థాల పాకెట్స్ కింద పడేశారు. అవి సరాసరి కాంపౌడులో కొచ్చి పడ్డాయ్. పాకెట్స్ తగిలి కొంతమంది గాయపడ్డారు.

అందరూ హాహాకారాలు చేస్తూ గాయపడ్డవారిని అంబులెన్స్‌లో ఎక్కించారు. వెంటనే అంబులెన్స్ మైద్య చికిత్సా శిబిరానికి బయలుదేరింది.

కొంతమంది కోపంగా మళ్ళీ ఆ అధికారుల దగ్గరకు నడిచారు.

"ఏమిటయ్యా ఇది! అంతపైనుంచి ఆ ఫుడ్ పాకెట్స్ ఎందుకు విసిరేసినట్లు?" అడిగాడు శాయిరామ్ అప్పటికప్పుడే ఆ గుంపుకు నాయకత్వం వహిస్తూ.

"ఆహారం రిలీఫ్‌కాంప్‌కి ఆ విధంగానే సప్లయి చేయమని ప్రధానమంత్రి ఆదేశమయ్యా!" విసుగ్గా అన్నాడు అధికారి.

"హెలికాప్టరు ద్వారా ఎందుకు? మేమేమయినా నీళ్ళల్లో మునిగి ఉన్నామా? లేక ఈ ప్రాంతం కటాఫ్ అయిపోయిందా?"

"చూడండి బాబూ! సివియర్ సైక్లోన్ వస్తుందనీ, మొత్తం కోస్తాప్రాంతమంతా మునిగిపోతుందనీ, ఎంతో ఆశతో కేంద్రం ఈ ఏర్పాట్లన్నీ చేసింది! ఈపాడు సైక్లోనేమో ఆశించిన ప్రకారం వచ్చి చావలేదు– ఎవరు మాత్రం ఈ పరిస్థితుల్లో ఏం చేస్తారు? చేసిన ఏర్పాట్లు, కార్యక్రమాలు ఈ బోడిసైక్లోన్ రాలేదన్జెప్పి కాన్సిల్ చేసేసుకోలేరు కదా!"

అప్పుడే రెండు లారీల్లో రిలీఫ్ కాంప్‌లకు భోజనాలు వచ్చాయ్.

"ఆ త్వరగా భోజనాలకు రండి అందరూ! 'క్యూ' కట్టండి!" అరచారు లారీలో ఉన్నవాళ్ళు.

"మళ్ళీ ఇదేమిటి? ఇప్పుడేగా పైన్నుంచి ఆహారం విసిరేశారు?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

"అది కేంద్రప్రభుత్వం సప్లయ్- ఇదేమో రాష్ట్రప్రభుత్వం సప్లయ్- ఆ మాత్రం తెలీదా" అన్నాడతను చిరాగ్గా.

"అదేమిటి- రెండు-రెండు భోజనాలెందుకు?" మరింత విస్తుపోతూ అడిగాడు రెడ్డి.

జనంలోనుంచి ఓ పెద్దమనిషి వచ్చి రంగారెడ్డి భుజం తట్టాడు చిరునవ్వుతో.

"ఆ మాత్రం తెలీదటయ్యా? కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ వేరు, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ వేరు. దగ్గర్లోనేమో ఎలక్షన్లున్నాయ్! అంచేత దేవుడి దయవల్ల వచ్చిన ఈ సైక్లోన్‌ని ఎవరికి వాళ్ళే ఉపయోగించుకుని తమతమ ఓటుబాంక్ పెంచుకోవాలను కోవడంలో కొత్తేముంది?"

"ఏడ్చినట్లుంది!" అంది పార్వతీదేవి.

"మేము రెండు భోజనాలెలా చేస్తాం? మావల్ల కాదు".

"కాదంటే పోలీసులు ఊరుకోరు- లాఠీలతో కొట్టి మరీ తినిపిస్తారు" ఎవరో అన్నారు.

"ఓ ప్రక్క మాకు వద్దని చెప్తున్నా ఈ బలవంతం ఏమిటి?"

అందరం చేసేదిలేక రెండు భోజనాలు కానిచ్చి ఎప్పుడు మమ్మల్ని వదుల్తారా అని ఎదుర్చూస్తూ కూర్చున్నాం.

సాయంత్రం అయిపోయింది కానీ పరిస్థితిలో మార్పులేదు. మళ్ళీ అందరం కలిసి అధికారుల దగ్గర కెళ్ళాం.

"ఏమిటండీ అది? అటు సైక్లోనూ లేదు, ఇటు ప్రధానమంత్రీ రారు! ఇంకెంత కాలమిలా? అవతల మాకు ఆఫీస్‌లున్నాయ్- సంసారాలున్నాయ్" అరిచాడు శాయిరామ్.

"మాకు మాత్రం లేవేంటయ్యా! కొంచెం ఓర్చుకోండి. తొందర పడతారేం? సైక్లోన్ అసలు ఎందుకు ఫెయిలందో విచారించడానికి ఓ కమిటీని వేశారు! ఇలా ఏర్పాట్లన్నీ చేసుకున్నాక- అది రాకపోతే ఎవరికయినా ఎంత వళ్ళు మండిపోతుంది? అదీగాక ఎలక్షన్లో విజయావకాశాలన్నీ కేవలం సైక్లోన్‌లో కేంద్రం ప్రభుత్వం చేసే రిలీఫ్ ఏర్పాట్ల మీదే ఆధారపడి ఉంటాయ్. అందరికి తిండీ, బట్ట, ఇళ్ళు కట్టించి ఇవ్వటం - అన్నదానాలు చేయటం ఇవన్నీ చేస్తే మరి ఎలక్షన్లకు ఎంత లాభం?"

గంటసేపు వాదించినా ఉపయోగం కనిపించకపోయేసరికి అందరం వెనక్కు తిరిగి

వచ్చేశాం. ఆ రాత్రి కూడా అక్కడే ఉండక తప్పలేదు. మర్నాడు ఉదయం రేడియోలో వచ్చిన ప్రకటన మరింత తమాషాగా కనిపించింది మాకు.

"బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం రాత్రి తీరాన్ని తాకింది. జిల్లూరు రప్రాంతం జలదిగ్బంధనం అయిపోయింది. అయితే వాయుగుండం అలాగే ఉంది. అంచేత ఏ క్షణాన్నయినా అది విజృంభించి విస్తృతంగా వర్షాలు పడి సముద్రపు తీర ప్రాంతాలన్నీ మునిగిపోయే సూచనలున్నాయ్!"

మాకా ప్రకటన ఏమీ అర్థంకాలేదు. ఒకే సైక్లోన్ ఇలా వాయిదాల పద్దతిలో తాకటమేమిటా అనేదే ఆశ్చర్యంగా ఉంది.

"ఆ ఈ రోజుల్లో అన్నీ వాయిదాల పద్దతి వ్యవహారాలేగా? కేంద్రం ప్రభుత్వోద్యోగులకు డి.ఏ. వాయిదాల పద్ధతిలోనే ఇస్తున్నారు– సైక్లోన్‌కి కేంద్రం చేసే సహాయం వాయిదాల పద్ధతే – అంచేత సైక్లోన్లు కూడా అలాగే ఏడుస్తున్నాయేమో?"

అందరం మళ్ళీ రెండు భోజనాలు చేసి నిద్ర పోతూండగా హఠాత్తుగా హడావుడి మొదలయింది.

స్పీకర్లో ఓ జీప్ జోరుగా అరుస్తూ వచ్చింది.

"సైక్లోన్ బాధితులారా! మిమ్మల్ని స్వయంగా కలుసుకొని మీ స్థితిగతులు తెల్సుకుని మీకు సహాయం చేయడానికి ప్రధానమంత్రి గారొస్తున్నారు. కనుక సహనంతో వేచియుండాల్సిసిందిగా ప్రార్థిస్తున్నాం"

"అమ్మయ్య! ఇంకా కొద్దిసేపట్లో మనకు చెర వదలి పోతుందన్న మాట" అన్నాడు రంగారెడ్డి ఆనందంగా.

సాయంత్రం అయిదవుతూండగా ప్రధానమంత్రి గారొచ్చారు. అందరికీ నమస్కారం చేస్తూ పరామర్శిస్తూ అన్ని సదుపాయాలు లభిస్తోందీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అప్పటికప్పుడే ఆయన పార్టీ తీలూకు కార్యకర్తలు ఓ మీటింగ్ కూడా ఏర్పాటు చేశారు. తమ పార్టీ ధ్యేయం కేవలం తెలుగు ప్రజల్ని సైక్లోన్ నుంచి రక్షించటమేనని పేర్కొన్నారు. ప్రధానమంత్రి స్వయంగా మాట్లాడుతూ "తెలుగు ప్రజలకు ఎప్పుడూ వచ్చే ఈ సైక్లోన్ బెడద చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోంది. అందుకే ఈసారి ఎలాంటి సహాయం కావాలన్నా ఎంత సహాయం కావాలన్నా చేయడానికి సంసిద్ధంగా ఉన్నాను" అంటూ తన ఆవేదన తెలియపరచారు. మమ్మల్ని చప్పట్లు కొట్టమని పోలీసులు బెదిరించారు.

"నీయవ్వ – అంతా నాటకం! ఇంతకు ముందొచ్చిన సైక్లోన్‌కి ఏ ప్రధానమంత్రీ రాలేదు! మరి ఈరాని సైక్లోన్‌కి ఏమిటో ఈ హడావిడి?" అన్నాడు రంగారెడ్డి ఆశ్చర్యంగా.

"ఎలక్షన్లు బాబో– ఎలక్షన్లు" అన్నాడొకతను. కొంతమంది నవ్వారు గానీ ఇంకొంతమంది రంగారెడ్డి వంక కోపంగా చూసారు.

"అవునవును! ఎలక్షన్ల మహాత్మ్యం కాకపోతే అదివరకు సైక్లోన్స్ కేమో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో గొడవ చేసినా పట్టించుకోకుండా, సైక్లోన్ వచ్చిన ఆరునెలలకు సెంట్రల్ టీమ్ రావటం, వాళ్ళు మరో నెలరోజులు కూర్చొని కాలిక్యులేటర్స్‌తో లెక్కలు కట్టి రిపోర్ట్ సబ్మిట్ చేయటం- అప్పుడు ఆర్థిక సహాయం అందజేయటం జరిగింది. ఇప్పుడేమో తెలుగు ప్రజల బాధలు చూసి గుండె తరుక్కుపోవడం, సైక్లోన్ రాకముందే సహాయాలు అందజేయటం, సగం సైక్లోన్స్‌కే ప్రాంతాల్ని పర్యటించేయడం ఏడు కోట్లు కాష్ డౌన్ చేసేయడం-" అంటూ శాయిరామ్ అరిచేసరికి అందరూ ఘొల్లున నవ్వారు. ఈ హడావుడి చూసి మరికొంతమంది రంగారెడ్డి చుట్టూ చేరారు. వాళ్ళ ప్రోత్సాహం చూచి రంగారెడ్డి మరింత విజృంభించాడు.

"సోదరీ సోదరీమణులారా! చూడండి ఈ నాటకం! గమనించండి ఈ ఘోరం. పిల్లికి చెలగాటం- ఎలుక్కి ప్రాణసంకటం సామెత విన్నారు కదా మీరు! ఇక్కడ అదే జరుగుతోంది...." అంటూ అతను స్పీచ్ మొదలుపెట్టాడు.

అక్కడి అధికారులు, పోలీసులు పరిస్థితిని గమనించారు. ఇంకాసేపుంటే రంగారెడ్డికి పెద్ద ఫాలోయింగ్ రావటం, ఆ తరువాత ప్రజలు రంగారెడ్డి జిందాబాద్ అని అరవటం- అ తర్వాత ఎలక్షన్లో రంగారెడ్డి నిలబడి గెలవటం ఖాయమని అనుమానించినట్లున్నారు.

వెంటనే రంగారెడ్డిని పక్కకు పిలిచి "మిమ్మల్ని వదిలేస్తున్నాం- మీరు వెళ్ళిపోవచ్చు-" అన్నారు.

ఆ మాట అన్నదే చాలని అందరం 'బ్రతుకు జీవుడా' అని రిలీఫ్ కాంప్ నుంచి బయల్దేరాము.

కొంతదూరం నడిచామో లేదో హఠాత్తుగా కేకలు వినిపించనయ్, పోలీసులు, ఇతర అధికారులు పరుగుతో వచ్చారు.

"ఎవ్వరూ కాంప్ వదలి వెళ్ళకండి!" అని అరచాడొకతను

"మళ్లీ ఏమయింది" అడిగాడు రంగారెడ్డి కోపంగా. గవర్నమెంట్ వాళ్ళు రిలీఫ్ కాంప్స్‌న్ని వీడియో ఫిలిమ్ తీస్తున్నారు. ఫిలిమ్‌తీసి టీవీన్యూస్‌లో చూపిస్తారు! అంతవరకూ అందరూ ఇక్కడే ఉండాలి" అన్నాడు. ఆమాట అనడమే ఆలస్యం అందరూ క్రాఫ్‌లు దువ్వు కోవటం, బట్టలు మార్చుకోవడం, ఆడాళ్ళు మేకప్ చేసుకోవటం ప్రారంభమయింది. ఎలాగైతేనేం మరో రెండు గంటలకు వీడియో షూటింగ్ ముగిసింది. "ఏదేమయినాసరే మన సినిమా షూటింగ్ ఈ ఏరియాలో పెట్టటానికి వీల్లేదు!" అన్నాడు జనార్ధన్.

"అవును! వేరే లొకేషన్స్ చూద్దాం" అన్నాడు బోసుబాబు ఉత్సాహంగా.

అందరం బయటకు వస్తుంటే ఓ పోలీస్ జీప్ వేగంగా వచ్చింది.

"సోదర సోదరీమణులారా! ఎవ్వరూ కాంప్ వదలడానికి వీల్లేదు. ఎందుకంటే మన ప్రియతమ ముఖ్యమంత్రి గారు సైక్లోన్ బాధితులందరినీ స్వయంగా పరామర్శించడానికి ఇక్కడికొస్తున్నారు. అంతవరకూ దయచేసి వేచియుండవలసిందిగా విజ్ఞప్తి చేస్తునాము"

ఆ మాటతో మాకు వళ్ళు మండిపోయింది.

"ఏమిటయ్యా వేచి యుండేది? ఇక్కడసలు సైక్లోనూ లేదు, గాడిద గుడ్డూ లేదు. ఒక అరగంట గాలీ, గంట వర్షానికి ఇంత హడావుడేమిటి?" అన్నాడు రంగారెడ్డి విరుచుకుపడుతూ. రంగారెడ్డిని చూసి ఆ ఊరి వాళ్ళంతా కూడా ఎదురు తిరిగారు.

"అవును! మా అందరికీ ఇళ్ళూ, పొలాలూ, ఇంకా మిగతా పనులూ ఏమీ లేవునకున్నారా? మేం ఉండం! ఏం చేస్కుంటారో చేసుకోండి!" అన్నారు.

అధికారులకు ఏం చేయాలో తోచలేదు.

"అలా సడెన్‌గా వెళ్ళిపోతామంటే ఎలా కుదుర్తుందయ్యా! మీ కోసం ముఖ్యమంత్రిగారు ప్రత్యేకంగా ఆహార పొట్లాలు హెలికాప్టర్ల ద్వారా కింద పడేయడానికి రెండు హెలికాప్టర్లను కాంట్రాక్ట్ తీసుకున్నారు. ఆహారపొట్లాల సప్లయ్ కోసం ఇంకో కంట్రాక్టర్‌ని రెండు కోట్ల రూపాయలకు ఏర్పాలు చేశారు. ఆ కాంట్రాక్ట్‌లు సైక్లోన్ రాలేదని చెప్పి కాన్సిల్ చేస్తే వాళ్ళూరుకుంటారా? కొంచెం మన ముఖ్యమంత్రి పరిస్థితి కూడా అర్థం చేసుకోవాలి–"

అందరూ గొడవ పడుతూండగానే మా పైన్నుంచి రెండు హెలికాప్టర్‌లు రెండు రౌండ్లు కొట్టి అరడజను పెద్ద సైజు పులిహోర పొట్లాలు పడేసి వెళ్ళిపోయినయ్. అవి నెత్తిమీద పడి పదిమందికి నెత్తి పగిలింది.

జనమంతా వాటి కోసం ఎగబడి కుమ్ముకోవడంతో – త్రొక్కిసలాట జరిగింది. ఆ త్రొక్కిసలాటలో రెండొందల మందికి గాయాలు తగలటం – వారిలో పదిమంది పరిస్థితి విషమంగా తయారవటంతో వాళ్ళందరినీ లారీల్లో తీసుకుని దగ్గర్లో వున్న ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళబోయారు.

తమను ప్రభుత్వాసుపత్రిలో చేరుస్తున్నారన్న విషయం తెలీగానే పరిస్థితి విషమంగా వున్నవారిలో ఎనిమిదిమంది లారీ దూకి చెట్లల్లోకి పారిపోయారు. మిగతా ఇద్దరూ ఆ షాక్‌కి తట్టుకోలేక ప్రాణాలు వదిలేశారు.

దాంతో జనమంతా ఎదురుతిరిగారు.

"ఏమిటయ్యా ఇది? పొద్దున్నేమో రెండుసార్లు భోజనం చేయించారు. ఇప్పుడు ఒక్కటి కూడా దిక్కులేదు– మాదార్ని మమ్మల్ని పోనీండి!"

"అరె! పోటానికి వీల్లేదని చెప్తుంటే మీక్కాదూ? ముఖ్యమంత్రి ఎంత రాత్రయినా

ఇక్కడికొచ్చి మిమ్మల్ని కలుసుకుని మాట్లాడేదాక ఒక్కరు కూడా కాంప్ వదలడానికి వీల్లేదు."

"మేం ఉండమయ్యా- ఏం చేస్తారో చేస్కోండి" అంటూ రంగారెడ్డి శాయిరామ్ ముందుకి కదిలేసరికి ఇంకొంతమంది వారిని వెంబడించారు.

సడెన్‌గా కలెక్టర్ ఎస్పీకి ఏదో చెప్పడంతో పోలీసులు హఠాత్తుగా వెళ్తున్నవాళ్ళ మీద లాఠీ ఛార్జ్ మొదలుపెట్టారు.

"ఓర్నాయనో- కాళ్ళ మీద తగిలిందిరో- దేవుడో" అని అరుస్తూ అందరూ దెబ్బలు తిని కుంటుకుంటూ మళ్ళీ గవర్నమెంట్ కాంప్‌లో కొచ్చారు.

రాత్రి పన్నెండింటికి ముఖ్యమంత్రి కారూ దాని వెనుక పాతిక ఏ.సి. కార్లూ వచ్చాయ్.

వెంటనే ముఖ్యమంత్రి కారు టాప్ మీద కెక్కాడు.

"సోదరులారా! సైక్లోన్ బాధితులను కూడా కేంద్ర ప్రభుత్వం 'రాజకీయం' చేయడానికి ప్రయత్నిస్తోంది. మీకు అన్నివిధాలా సాయం అందిచే హక్కు కేవలం రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంది. అయినా గానీ కేంద్రం జోక్యం చేసుకుని మాకు ఆటంకాలు కల్పిస్తోంది. మీరంతా మరో నాలుగురోజులు మా రిలీఫ్ కాంప్‌లోనే సుఖంగా ఉండటానికి అన్ని ఏర్పాట్లూ చేసేశాం! కనుక ఎవ్వరూ కాంప్ వదలకండి!"

"మాకు రాత్రి తిండి దొరకలేదు" ఎవరో అరచారు వెనుకనుంచి.

ముఖ్యమంత్రి కోపంగా కలెక్టర్ వేపు తిరిగాడు.

"కంట్రాక్టర్ రెండువేలు ఆహార పొట్లాలు హెలికాప్టర్ ద్వారా వదిలినట్లు చెప్పాడు సార్." అన్నాడు కలెక్టర్.

"అవున్సార్- కావాలంటే చూడండి! బిల్లు కూడా నా దగ్గరుంది" అన్నాడు కంట్రాక్టర్.

"మా కలెక్టర్ గారు, కంట్రాక్టర్ గారు రెండువేల పైచిలుకు ఆహారపొట్లాలు వేశారని చెప్తున్నారు.

అయినా ఎవరకీ అవి అందలేదని అంటున్నారంటే - ఇదంతా కేంద్ర ప్రభుత్వ కుట్ర అని మీకు సవినయంగా మనవి చేస్తున్నాను. మా పార్టీ, మా ప్రభుత్వం ఎల్లవేళలా ప్రజల క్షేమమే ధ్యేయంగా పని చేస్తాయని కూడా మీకు మనివి చేస్తునాను- జైహింద్-"

అందరూ వెళ్ళిపోయారు.

"ఇప్పటికయినా మేము మా ఇళ్ళకు వెళ్ళిపోవచ్చా?" కుంటుతూ ముందుకొచ్చి అడిగాడు రంగారెడ్డి.

"ఇప్పుడు వెళ్ళండయ్యా! ఎవరొద్దన్నారు?" అన్నాడు ఓ అధికారి.

"ఇంత రాత్రివేళ ఎలా వెళ్తాం?" అడిగింది పార్వతీదేవి భయంగా.

అప్పుడే ఆమె చేతిలోని ట్రాన్సిస్టర్‌లో మ్యూజిక్ ఆగిపోయింది.

"ఆకాశవాణి– ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన భయంకరమయిన సైక్లోన్ వల్ల నిరాశ్రయులయిన రెండు లక్షల మందిని భారత ప్రధాని నేడు స్వయంగా కలుసుకున్నారు. ఇప్పటికేవారి పునరావాస కార్యక్రమాల కోసం ఇరవై కోట్ల రూపాయలు ఖర్చు చేయటం జరిగినా, అది చాలని దృష్ట్యా, మరో నలభై కోట్లు తమ సహాయ నిధి నుంచి ఖర్చు చేయాలని నిర్ణయించారు. సైక్లోన్ బాధితులను ఆదుకోవటంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని ప్రధాని ఆవేదన వెలి బుచ్చారు. రేపు ఉదయమే ప్రత్యేక కేంద్ర బృందం సైక్లోన్ బాధిత ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని తాజాగా సమీక్షించాలని ప్రధాని ఆదేశాలిచ్చారు–" అందరం ఉలిక్కిపడ్డాం.

"ఆలస్యం చేస్తే మళ్ళీ ఆ కమిటీ వచ్చేవరకూ మనల్ని కాంప్‌లో బంధిస్తారు– త్వరగా పదండి! కాలినడకన ఎంతదూరం వీలయితే అంతదూరం పారిపోదాం–" అన్నాడు జనార్ధన్.

అందరం చీకట్లోనే ముందుకి కదిలాం.

"అవునూ! కేంద్రం ఈ ఒక్క రోజులోనే ఇరవై కోట్లు ఖర్చు పెట్టిందంటున్నారు– రాష్ట్ర ప్రభుత్వమేమో పదికోట్లు ఖర్చుపెట్టిందంటున్నారు– ఆ డబ్బంతా ఎక్కడ ఎలా ఖర్చయి ఉంటుంది?" ఆడిగాడు శాయిరామ్.

ఆ ప్రశ్నకు ఎవరూ జవాబు ఇవ్వలేదు.

అందరూ ఆ కాంప్‌కి వీలయినంత దూరం వెళ్ళిపోవాలన్న తొందర్లో ఉన్నారు.